నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 3 మే 2024 | HYDERABAD




గురువారం బోయిన్‌పల్లి మార్కెట్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత -కంటోన్మెంట్



తెలంగాణ భవన్‌లో యువ నాయకులు కార్తిక్‌రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఆకుల అరవింద్‌కుమార్ దాదాపు 150 మందితో కలిసి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. - ఆర్కేపురం

# మాకు 12 సీట్లు ఇవ్వండి

## సంవత్సరంలో కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు

హైదరాబాద్‌ను యూటీ చేయాలనే కుట్రను అడ్డుకుందాం

ఎన్నికల తర్వాత రేవంత్, దానం బీజేపీలోకి..

జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి రోడ్ షోల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కూకట్‌పల్లి రోడ్ షోలో కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

సిటీబ్యూరో, మే 2, (నమస్తే తెలంగాణ)/జూబ్లీహిల్స్, కేపీహెచ్‌బీకాలనీ : కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చిన కరెంట్, తాగునీటి కష్టాలు పోవాలంటే.. బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవాలని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి 10-12 సీట్లు అప్పజెప్పితే.. సంవత్సరంలో కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాలుగున్నర నెలల కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు బాధపడుతున్నారని, ఆ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో మోసపోయామని గుర్తించారన్నారు. అందుకే కేసీఆర్ చేపడుతున్న బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గురువారం సికింద్రాబాద్, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు పద్మారావు గౌడ్, రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీరామ్‌నగర్ చౌరస్తాలో, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేటలో కేటీఆర్ రోడ్ షోలు నిర్వహించి ప్రసంగించారు. 2014లో ఖాతాలు తెరవండి..రూ.15 లక్షలు వేస్తా, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తా..రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ ఏం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. మోదీ తరహాలోనే రేవంత్‌రెడ్డి రూ.4వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2500, రైతుబంధు, రుణమాఫీ అని..నాలుగున్నర నెలలు గడిచినా.. ఇందులో ఒక్కటి కూడా అమలు చేయలేదని, బడే బాయ్ మోదీ..చోటే బాయ్ రేవంత్‌రెడ్డి ఇద్దరు ఇద్దరే.. అని కేటీఆర్ విమర్శించారు.



జూబ్లీహిల్స్ రోడ్ షోలో నినదిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

### యూటీ కుట్రను అడ్డుకుందాం

జూన్ 2 తర్వాత హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం చేయాలని కుట్ర చేస్తున్నారని, అడ్డుకోవాలంటే గులాబీ కండువా, కేసీఆర్ గళం పార్లమెంట్‌లో వినబడాలని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్‌ను కేసీఆర్ అన్ని విధాలా బాగు చేస్తే, ఈ నగరాన్ని సర్వనాశనం చేయాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొత్త పరిశ్రమలు రాకపోగా..ఉన్నవి తమిళనాడు, గుజరాత్‌కు తరలిపోయాయని, ఉన్నవి కాపాడుకోలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని కేటీఆర్ విమర్శించారు. ఒక్క ఓటుతో అటు బడే బాయ్.. ఇటు చోటే బాయ్‌కి గుణపాఠం చెప్పాలన్నారు.

### అక్కరకు రానీ బీజేపీ..

గులాబీ కండువాతో ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కనీసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా సిగ్గు లేకుండా కాంగ్రెస్‌లోకి వెళ్లి ఎంపీగా పోటీ చేస్తున్నారన్నారు. ఎన్నికలు అయ్యాక సీఎం రేవంత్‌రెడ్డి, దానం నాగేందర్ బీజేపీలోకి వెళ్తారని కేటీఆర్ అన్నారు. ఇక సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి.. హైదరాబాద్‌కు నయా పైసా పనిచేయలేదని విమర్శించారు. 'అక్కరకు రానీ బీజేపీ, పనిచేయని కిషన్‌రెడ్డి మనకొద్దు' అని కేటీఆర్ చెప్పారు.

### హైదరాబాద్ ప్రజలకు రుణపడి ఉంటా..

పదేండ్ల బీఆర్‌ఎస్ అభివృద్ధి పాలన చూసిన ప్రజలు..హైదరాబాద్ మహానగరం మరింత అభివృద్ధి కావాలని కోరుకున్నారని, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టారని, జీహెచ్ఎంసీ పరిధిలో 24 సీట్లలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా అవకాశం ఇవ్వకుండా బీఆర్‌ఎస్‌కు 16 సీట్లను గెలిపించారని, ఈ విషయంలో హైదరాబాద్ ప్రజల రుణం తీర్చుకోలేనిదని కేటీఆర్ అన్నారు. అదే విధంగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే పార్లమెంట్‌లో అభివృద్ధిపై గళం విప్పుతారని చెప్పారు.

### గెలుపు ఖాయమైంది: అభ్యర్థి పద్మారావు

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. ప్రజా స్పందన చూస్తుంటే.. సికింద్రాబాద్‌లో గులాబీ విజయం ఖాయమైందని, మెజార్టీ మాత్రమే మిగిలి ఉందన్నారు. ఈ రోడ్‌షోలలో ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు ముద్దం నర్సింహా యాదవ్, సబిహా, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, మందాడి శ్రీనివాస్, పండాల సతీశ్‌గౌడ్, రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య పాల్గొన్నారు.



కూడలి..జనసందోహం

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలోని శ్రీరామ్‌నగర్ వద్ద రోడ్‌షోకు భారీగా హాజరైన జనం


## నేడు, రేపు హోం ఓటింగ్



సిటీబ్యూరో, మే 2 ( నమస్తే తెలంగాణ ) : ఎన్నికల సిబ్బంది నేడు, రేపు హోం ఓటింగ్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో 121 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 86 మంది సీనియర్స్ సిటిజన్స్, 35 మంది దివ్యాంగులు ఉన్నారు. శుక్ర, శనివారం ఉదయం 7:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హోం ఓటింగ్ ఉంటుంది. ఓటర్లకు ఫోన్ చేసి.. వారు అందుబాటులో ఉన్న సమయంలో ఎన్నికల సిబ్బంది బృందాలుగా సంబంధిత ఓటర్ల వద్దకు వెళ్లి..హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తారు. కాగా, ఓటర్లు అందరూ అందుబాటులో ఉండాలని హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి చెప్పారు.

## 50 కోట్ల మందిని.. గమ్యస్థానాలకు చేర్చి..

### హైదరాబాద్ మెట్రో.. మరో మైలురాయి



సిటీబ్యూరో, మే 2(నమస్తే తెలంగాణ) : అనతికాలంలోనే అనూహ్యమైన ఆదరణ పొందిన హైదరాబాద్ మెట్రో.. మరో మైలురాయిని చేరుకున్నది. ఏకంగా ఇప్పటివరకు 50 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చి..చరిత్రను లిఖించుకున్నది. దేశంలోనే మూడో అతి పొడవైన మెట్రో వ్యవస్థగా గుర్తింపు పొందిన హెచ్ఎంఆర్ఎల్.. నగరవాసుల మనస్సును చూరగొంటున్నది. అన్ని మార్గాలు అందుబాటులోకి వచ్చిన అనతి కాలంలోనే మెట్రోకు అనూహ్యమైన స్పందన లభించింది. మియాపూర్-అమీర్‌పేట మార్గంలో 11 కిలోమీటర్ల మెట్రో రైలు సేవలను 2017లో తీసుకురాగా, అప్పటి నుంచి దశల వారీగా సర్వీసులను పెంచుతున్నారు. ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గ్ మార్గాల్లో దాదాపు 68 కిలోమీటర్ల పొడవైన లైన్లు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం నగరంలో నిత్యం 4-5 లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను పొందుతుండగా, 2017 నుంచి ఇప్పటివరకు (2024 మే 1 నాటికి) 50 కోట్ల మంది మెట్రోలో ప్రయాణించడంతో హెచ్ఎంఆర్ఎల్ మరో మైలురాయిని అధిగమించినట్లైంది. గతేడాది జూలైలో ఒక్క రోజులో 5.1 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చి..హైదరాబాద్ మెట్రో రికార్డును సృష్టించిన విషయం తెలిసిందే.

# ఉల్టా.. చోర్ కొత్వాల్ కో డాంటే.!

ప్రశ్నిస్తున్నందుకే బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ అరెస్టు

గందరగోళంగా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ ఫిర్యాదు

తన నోటీసులోనే క్లరికల్ తప్పులున్నాయని అంగీకరించిన శ్రీనివాస్

షోకాజ్ నోటీసు ఇస్తున్నామని ప్రకటించినా.. నేటికీ చర్యలు కరువు

తప్పులు కప్పిపుచ్చుకునేందుకు.. ఎదురు దాడి

సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే.. అంటే ఇదే మరి. సమస్యలు విస్మరించింది వారే... సమస్యలు ఉన్నాయని అధికారికంగా ధ్రువీకరించింది వాళ్లే.. క్లరికల్ తప్పిదాలు జరిగాయని అంగీకరించింది కూడా వాళ్లే... కానీ, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాడంటూ ప్రశ్నించిన వ్యక్తిపై కేసులతో ఎదురుదాడి చేస్తున్నారు. అందుకే ఉస్మానియా యూనివర్సిటీ 'ఫేక్' కథ అనేక మలుపులు తిరుగుతోంది. ఉస్మానియా వేదికగా రాష్ట్రంలో కరెంటు, నీటి కొరత ఉన్నాయనే వాస్తవాలు బయటికొచ్చి, రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతుండటంతో దానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌పై కేసు పెట్టి ఇకముందు ఎవరూ ప్రశ్నించకుండా కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ ఫిర్యాదు గందరగోళంగా ఉండటమే నిదర్శనంగా పలువురు చెబుతున్నారు. మరోవైపు తాను జారీ చేసిన నోటీసులో క్లరికల్ తప్పిదాలు ఉన్నాయని చీఫ్ వార్డెన్ అంగీకరించినా... షోకాజ్ నోటీసు జారీ చేసిన రిజిస్ట్రార్ ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం కూడా ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నది.

ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లు, మెస్‌ల్లో కరెంటు కోతలు, నీటి కొరత ఉన్నట్లుగా ఇటీవల చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ జారీ చేసిన నోటీసుల్లో వెల్లడైంది. ఈ విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ బయటపెట్టడంతో హడావుడి చేసిన రాష్ట్ర సర్కారు ఆపై తప్పు మీద తప్పు చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యల్ని తొక్కి పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి గతేడాది నోటీసుల్లోనూ ఇదేరీతిన ఉందంటూ ఎక్స్‌లో ఒక నోటీసును పోస్టు చేశారు. అది ఫేక్ అంటూ విద్యార్థి నాయకుడు నాగేందర్‌రావు అసలు నోటీసును వెల్లడించడం... దానిని బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ కూడా ట్వీట్ చేయడంతో అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇంతవరకు బాగానే ఉంది.. కానీ నాగేందర్‌రావు, క్రిశాంక్ పోస్టు చేసిన నోటీసునే ఫేక్ అంటూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ ఉస్మానియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఫిర్యాదులో స్పష్టంగా.. కొందరు వ్యక్తులు గతేడాది పేరిట వైరల్ చేస్తున్న నోటీసు ఫేక్ అని ఉండాలి. దీంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు చేసిన నోటీసు అసలుదే... కొందరు వ్యక్తులు పోస్టు చేసిన నోటీసునే ఫేక్ అని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొనాలి. కానీ, చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ చేసిన ఫిర్యాదులో ఇలాంటి వివరాలేవీ లేవు. కేవలం 'కొందరు వ్యక్తులు ఫేక్ నోటీసును సోషల్ మీడియాలో తిప్పుతూ, యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు.. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నందున వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'.. అని మాత్రమే ఉంది. కానీ, ఎక్కడా గత ఏడాది నోటీసు అని పేర్కొనకపోగా.. సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్‌కు వ్యతిరేకంగా పోస్టు చేసిన ట్వీట్‌లను కూడా అందుకు జత చేయలేదు. పైగా, ఎక్కడా ఫలానా వ్యక్తులు అంటూ క్రిశాంక్ పేరు గానీ, ఇతరుల పేర్లు గానీ ఫిర్యాదులో పేర్కొనలేదు. కానీ, రెండు రోజుల కిందట ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు క్రిశాంక్, నాగేందర్‌రావుపై కేసులు నమోదు చేశారు.

ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు చేసిన గతేడాది నోటీసు అసలుదని పోలీసులు ధ్రువీకరిస్తున్నారా.? క్రిశాంక్ పోస్టు చేసిన గతేడాది నోటీసు ఫేక్ అని ధ్రువపరుచుకున్నారా.? అసలు ఫలానా వాళ్లు పోస్టు చేసిన గతేడాది నోటీసు ఫేక్ అని చీఫ్ వార్డెన్ ఏమైనా నిర్ధారించారా.?.. ఇలా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా క్రిశాంక్‌పై 2011 నుంచి ఉన్న పాత కేసులన్నీ తోడి, ఇప్పుడు జత చేయడమే మరిన్ని అనుమానాలకు ఆస్కారమిస్తున్నది.



OFFICE OF THE CHIEF WARDEN, HOSTELS & MESSES,
OSMANIA UNIVERSITY, HYD.-7.

No. 752 /CWO/H&M/OU/2023. Dated:-12.05.2023.

NOTICE

It is hereby informed to all the P.G. Boarders of University Hostels and Messes that the University has declared Summer Vacation to the students and also there is a acute shortage of water and electricity in the University Hostels & Messes. The Messes will be closed w.e.f. 14.05.2023 (After Lunch) and will be reopened on 05.06.2023 (Lunch onwards).

All the boarders are requested to Co-operate in this regard.

CHIEF WARDEN

NOTICE BOARDS OF CAMPUS HOSTELS & MESSES, OU

కాంగ్రెస్ షేర్ చేసిన దొంగ నోటీస్



OFFICE OF THE CHIEF WARDEN, HOSTELS & MESSES,
OSMANIA UNIVERSITY.

NOTICE

No:758/cwo/2023 Date: 12.05.2023.

It is hereby informed to all the P.G. Boarders of University Hostels and Messes, that the University has declared Summer Vacation to the students and hence the Mess facility to the P.G. boarders will be closed w.e.f. 14.05.2023 (After Lunch) and will be re-opened on 05.06.2023 (Lunch onwards).

All the boarders are requested to Co-operate in this regard.

CHIEF WARDEN
HOSTELS & MESSES, OU.

NOTICE BOARDS OF HOSTELS & MESSES, OU.

2023లో..అసలు నోటీస్



OFFICE OF THE CHIEF WARDEN HOSTELS & MESSES
Osmania University, Hyderabad – 500 007.

No. 157/CWO/H&M/OU/2024. Dated:- 30.04.2024

To,
The Station House Officer,
Osmania University P.S.,
HYDERABAD.

Sub:- Complaint for posting fake information – Take Action – Request – Regarding.
Ref:- @Krishank_BRS

Respected Sir,

It is hereby informed that a fake Notice regarding the [illegible] of University Hostels and Messes, OU is being circulated in the social media. The message is false and it is damaging the reputation of the University. [illegible] requested to stop the circulation of the fake message immediately and take suitable action immediately against the responsible person responsible and behind spreading the fake message.

Thanking you,

Yours faithfully,
CHIEF WARDEN
Hostels & Messes, OU.

చీఫ్ వార్డెన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు

### వింతగొలుపుతున్న చీఫ్ వార్డెన్ వ్యాఖ్యలు..

రెండు రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేసిన గతేడాది నోటీసు అసలుదని, విద్యార్థి నాయకుడు నాగేందర్‌రావు పోస్టు చేసినది ఫేక్ అని చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఆ సందర్భంగా ఆయన తన పరిశీలన వెల్లడించారు. నోటీసుల్లో నోటీసు నంబరుతో సహా అంతా ప్రింట్‌లోనే ఉంటుంది.. గానీ, పెన్‌తో రాయమని చెప్పారు. అందుకే నాగేందర్‌రావు పోస్టు చేసిన దానిలో నంబరు పెన్‌తో వేసినందున అది ఫేక్ అని నిర్ధారించారు. కానీ, కొన్ని గంటల వ్యవధిలోనే అదే తప్పిదాన్ని ఆయన చేశారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారంటూ శ్రీనివాస్ ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో నంబర్ పెన్‌తో వేసి ఉంది. మరి... నోటీసు నంబరు పెన్‌తో వేస్తే ఫేక్ అయినప్పుడు, శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు కూడా ఫేక్ అవ్వాలి కదా.. అనే విమర్శలు వినిపిస్తున్నాయి.